సాక్షి రంగారెడ్డి
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



పొగ వెలువడి..

అక్రమంగా కొనసాగుతున్న సీసం బట్టీలతో జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉంది. 8లో▸



నల్లబెల్లం పట్టివేత

నాటుసారా తయారీ కోసం అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



తెగని పంచాయితీ

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో.. పాత రిజర్వేషన్లే కొనసాగిస్తారా.. అంటూ పల్లెల్లో చర్చ సాగుతోంది. 8లో▸

న్యూస్‌రీల్

ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్పతినాయక్

కడ్తాల్: గిరిజన లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం ఎవరు చేసినా సహించేది లేదని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్పుల లక్పతినాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం సేవాలాల్ సేన నాయకులతో కలిసి మాట్లాడారు. గిరిజన లంబాడీలను కించపరుస్తూ మాట్లాడే వారిని ఆయా పార్టీల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్టీ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ సన్నిధిలో సినీ నటుడు



అమ్మవారిని దర్శించుకున్న శ్రవణ్

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం సినీనటుడు శ్రవణ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, నిర్వాహకులు పాల్గొన్నారు.

'పట్నం' చిన్న చెరువులో వ్యర్థాల డంప్

ఇబ్రహీంపట్నం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు హైదరాబాద్ చార్మినార్ నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి రాత్రికి రాత్రే ఇబ్రహీంపట్నం చిన్న చెరువులో డంప్ చేశారు. శనివారం అర్ధరాత్రి నగరం నుంచి జీహెచ్‌ఎంసీ– 4కి చెందిన రెండు వాహనాల్లో తెచ్చిన చెత్తను చెరువులో పోస్తుండగా స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వెళ్లి పరిశీలించారు. రెండు వాహనాలను అదుపులోకి తీసుకొని, నలుగురు వ్యక్తులపై ఎన్విరాన్‌మెంట్ కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. చెరువులో వ్యర్థాలను పారబోసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. చెరువును కలుషితం చేయడానికి యత్నించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వంగూరు రాములు

కడ్తాల్: హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆల్ హమాలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక వీరయ్య అధ్యక్షతన జిల్లా హమాలీ కార్మిక యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న 29 చట్టాలు యథావిధిగా కొనసాగించాలని, పని భారం తగ్గించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా హమాలీ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పగడాల యాదయ్య, అధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్, కోశాధికారిగా పెంటయ్య, ఉపాధ్యక్షులుగా వీరయ్య, గోపాల్, రమేశ్, దుర్గయ్య, సహాయ కార్యదర్శులుగా మొగులయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, నర్సింహ, దయానంద్, వెంకటయ్య ఎన్నికయ్యారు.

చెట్లు.. కాపాడేటట్లు!

అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు

- కొలిక్కిరానున్న బీజాపూర్ రహదారి విస్తరణ
- రోడ్డు వంకరలు లేకుండా ముందస్తు చర్యలు
- ఎన్‌జీటీకీ స్పష్టం చేయనున్న ప్రభుత్వం
- ఇప్పటికే భూసేకరణ పూర్తి.. రెండు చోట్ల బైపాస్ పనులు



బీజాపూర్ రోడ్డు పక్కన ఉన్న చెట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రోడ్డుకు ఇరువైపులా ఉన్న పురాతన మర్రి చెట్లకు ముప్పు లేకుండా నిర్మాణంలో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. చెట్ల ఉనికిని ఏమాత్రం దెబ్బతీయకుండా ఆయా ప్రాంతాల్లో స్వల్ప మార్పులు చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. వరుస ప్రమాదాల నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)లో కేసులు వేసిన పర్యావరణవేత్తలతో చర్చించినట్లు తెలుస్తోంది. ఎన్‌జీటీ అంగీకారం, పర్యావరణవేత్తల సూచనల మేరకు ఇకపై ముందుకు వెళ్లనుంది. ఎన్‌జీటీలో కేసుల కారణంగా నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ పనులకు త్వరలో మోక్షం లభించే అవకాశం ఉంది.

నాలుగేళ్ల క్రితమే శంకుస్థాపన

బీజాపూర్ రహదారి 163పై రక్తపుటేరులు పారుతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం వెలుగు చూస్తూనే ఉంది. ఎవరో ఒకరు మృత్యువాత పడుతూనే ఉన్నారు. ప్రమాదాల నివారణ, మెరుగైన ప్రయాణం కోసం ఇటు అప్పా జంక్షన్ (తెలంగాణ పోలీసు అకాడమీ) నుంచి అటు మన్నెగూడ వరకు నాలుగు లేన్లుగా విస్తరించాలని ఆరేళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.928.41 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. మొత్తం 266.55 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించింది. అప్పా టు మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మేర విస్తరించతలపెట్టిన రోడ్డు పనులకు 29 ఏప్రిల్ 2022లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. దారి పొడవునా 18 అండర్‌పాసులు, మొయినాబాద్ సమీపంలో 4.35 కి.మీ, చేవెళ్ల సమీపంలో 6.36 కి.మీ రెండు బైపాస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.



మొయినాబాద్ వద్ద నిర్మాణంలో ఉన్న బైపాస్‌రోడ్డు

గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులతో జాప్యం

రోడ్డుకు ఇరువైపులా పురాతన, ఎత్తయిన మర్రి చెట్లు ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా 750పైగా వృక్షాలను తొలగించాల్సి వచ్చింది. ఇదే అంశంపై ×బన్యన్ ట్రీ× అనే స్వచ్ఛంద సంస్థ పర్యావరణ పరిరక్షణ పేరుతో ఎన్జీటీని ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో రోడ్డు పనులకు బ్రేక్ పడింది. భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసిన నాటి ప్రభుత్వం చెట్లను రీ లొకేట్ చేసి, కేసును ఎత్తివేయించలేకపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లాకు ఇదే మార్గం నుంచి వెళ్లి వస్తుండటం, ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం, ఏళ్లుగా రోడ్డు నిర్మాణం ముందుకు సాగకపోవడంపై స్పందించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వంకరలు లేకుండా అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులతో కూడిన నిర్మాణ పనుల డీపీఆర్‌ను కోర్టుకు సమర్పించనున్నట్లు తెలిసింది. చెట్లున్న చోట రోడ్డును ఒకవైపు పెంచుతూ పోవడం ద్వారా ఆయా వృక్షాలను తొలగించాల్సిన అవసరం ఉండబోదని ఎన్జీటీకీ వివరించనుంది. ఎన్జీటీలో ఇప్పటికే నమోదైన కేసు వచ్చే వారంలో విచారణకు వచ్చే అవకాశం ఉంది.

రేపటి నుంచి ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

కొడంగల్: కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రేపటి నుంచి ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం తాండూరులోని వైద్య కళాశాల భవనంలో కొడంగల్ మెడికల్ కళాశాలను తాత్కాలికంగా నిర్వహించనున్నారు. అక్కడ అన్ని వసతులతో భవనాన్ని సిద్ధం చేశారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఎంబీబీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం ఈ నెల 16నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ర్యాంకర్ల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును కాళోజీ నారాయణరావ్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సిద్ధం చేస్తోంది.

హనీట్రాప్ కలకలం

యోగాశ్రమం నిర్వాహకుడికి ఇద్దరు మహిళల వలపువల

- రహస్య వీడియోలతో బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- పక్కా ప్లాన్‌తో అరెస్టు
- స్థానికంగా చర్చనీయాంశం



పోలీసుల అదుపులో నిందితులు

చేవెళ్ల: హనీట్రాప్ వ్యవహారం చేవెళ్లలో కలకలం రేపింది. నగరంలోని గోల్కొండ పోలీసులు ఐదుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు తెలియడంతో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ పరిధిలోని దామరగిద్దకు చెందిన మిట్ట వెంకటరంగారెడ్డి గతంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కొంత కాలంగా ఆయన దామరగిద్దలోని తన వ్యవసాయ క్షేత్రంలో గురు దత్తాత్రేయ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులోనే సీక్రెట్ ఆఫ్ నేచర్ అనే యోగాశ్రమం నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అక్కడే ఆశ్రయం కూడా కల్పిస్తుంటారు. ఈ క్రమంలో ఆరోగ్య సమస్యలు ఉన్నాయని ఇద్దరు మహిళలు 20 రోజుల క్రితం ఆశ్రమానికి వచ్చారు. అక్కడే ఉంటూ వెంకటరంగారెడ్డికి వలపు వల వేశారు. సీక్రెట్‌గా వీడియోలు తీసి బయటకు వెళ్లిన వారు ముఠా సభ్యుల్లో ఒకరైన అమర్ అనే వ్యక్తితో కలిసి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. భయపడిన వెంకటరంగారెడ్డి ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవని రూ.25లక్షల చొప్పున రెండు చెక్కులు ముందు డేట్ వేసి ఇచ్చారు. వారు మరో రూ.2 కోట్లు లేదా రెండెకరాల భూమి ఇవ్వాలని.. లేదంటే వీడియోలు సోషల్‌మీడియాలో, యూట్యూబ్‌లో పెడతామని.. చంపుతామని బెదిరింపులకు దిగారు. దీంతో ఆయన ఈనెల 4న హైదరాబాద్‌లో తనకు తెలిసిన పోలీస్ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశాడు. ముఠాను పట్టుకునేందుకు పోలీసులు పక్కాగా స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా శనివారం గోల్కొండ పరిధిలోని తారామతి బారాదరి హోటల్ వద్దకు రావాలని, రూ.2 కోట్లు ఇస్తామని చెప్పి పిలిచారు. అక్కడికి రాగానే ప్లాన్ ప్రకారం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెంకటరంగారెడ్డి వద్ద డబ్బులు కాజేసేందుకు పక్కా స్కెచ్‌తోనే ముఠాసభ్యులు హనీట్రాప్‌నకు పాల్పడినట్లు తెలుస్తోంది.

సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా

హుడాకాంప్లెక్స్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. పార్టీ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్‌నగర్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వాలు సమైక్య దినోత్సవమంటూ, ప్రజాపాలన దినోత్సవమంటూ రకరకాల పేర్లతో వేడుకలు జరపడమేమిటని ప్రశ్నించారు. నాటి సాయుధ పోరాటమే లేకపోతే నేడు తెలంగాణ రాష్ట్రమే ఉండేది కాదన్నారు. సాయుధ పోరాటం అనే పేరు పలికేందుకు భయముంటే తెలంగాణ రైతాంగ పోరాటం పేరుతోనైనా ఉత్సవాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాటి సమరయోధుల త్యాగాలు, చరిత్ర భావితరాలకు అందించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయాలని, పోరాటానికి నాయకత్వం వహించిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, చాకలి ఐలమ్మ, కమలాదేవి, ధర్మభిక్షం వంటి మహానేతల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఐతరాజు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్, ఎస్టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జిల్లాల కృష్ణ, మహబూబ్, కమలమ్మ, రమావత్ సక్రునాయక్, వర్రె ఇస్తారు, నూర్జహాన్, నర్సమ్మ పాల్గొన్నారు.

ఎడాపెడా ఎల్సీలకు స్వస్తి



వారంలో ఒకే రోజుకు పరిమితం

- గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం
- అయినా నిరంతరాయంగా నాణ్యమైన కరెంటు సరఫరా
- అంతరాయాలు తప్ప ఎలాంటి కోతలు లేవు
- 'సాక్షి'తో డిస్కం ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'గతంలో ఎల్సీ (లైన్ క్లియరెన్స్)లపై నియంత్రణ ఉండేది కాదు. ఏ సబ్‌స్టేషన్ పరిధిలో ఏ ఫీడర్‌కు ఎల్సీ తీసుకున్నారో క్షేత్రస్థాయి ఇంజనీర్లకు తెలిసేది కాదు. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికాం. వారానికి ఒక రోజు (శనివారం) గంట నుంచి రెండు గంటలలోపు మాత్రమే ఎల్సీలకు అనుమతి ఇస్తున్నాం. డిస్కం పరిధిలో మూడు వేలకుపైగా ఫీడర్లు ఉండగా, వీకెండ్‌లో 300లోపు ఫీడర్ల పరిధిలోనే ఎల్సీలు జారీ చేస్తున్నాం. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులకు ముందస్తు సమాచారం చేరవేస్తున్నాం. సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడుతున్నాం. ప్రస్తుతం సాంకేతిక కారణాలతో వెలుగు చూస్తున్న స్వల్ప అంతరాయాలే కానీ.. అధికారికంగా ఎలాంటి విద్యుత్ కోతలు అమలు చేయడం లేదు' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.నరసింహులు తెలిపారు. ఈ మేరకు 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే..

30 నిమిషాలకు మించి ఇవ్వడం లేదు

'నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో విద్యుత్ ఉత్పత్తి నిరంతరాయంగా జరుగుతోంది. సామర్థ్యానికి మించి ఉత్పత్తి అవుతోంది. డిమాండ్‌కు సరఫరాకు మధ్య కనీస వ్యత్యాసం కూడా లేదు. సాంకేతిక కారణాలతో అక్కడక్కడా వెలుగుచూస్తున్న అంతరాయాలకు కారణాలపై విశ్లేషిస్తున్నాం. ఇంజనీర్లు వెంటనే అప్రమత్తమై సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. ఎఫ్‌ఓఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తున్నాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా కాపాడుతున్నాం. అయినా కొంత మంది పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. నిజానికి వీకెండ్ మినహా ఇతర రోజుల్లో ఎల్సీలకు అనుమతి ఇవ్వడం లేదు. మల్టీ స్టోరేజీ భవనాలకు, వాణిజ్య సముదాయాల్లోని కొత్త కనెక్షన్లు, డీటీఆర్ ఛార్జింగ్ కోసం 30 నుంచి 60 నిమిషాలు మాత్రమే ఎల్సీ ఇస్తున్నాం. అదీ కార్పొరేట్ ఆఫీసు నుంచి లిఖిత పూర్వక అనుమతి పొందిన వారికే. సాధారణ సర్వీసులకు కనెక్షన్ ఇచ్చేందుకు ఎలాంటి ఎల్సీలు అవసరం లేదు. క్షేత్రస్థాయిలోని డీటీఆర్ ఏబీ స్విచ్ ఆఫ్ చేసి కనెక్షన్ ఇచ్చే వెసులుబాటు కల్పించాం.

వినియోగం చూస్తే ఆశ్చర్యమేస్తోంది

ప్రస్తుతం గ్రేటర్‌లో 63 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి తోడు ప్రతి నెలా కొత్తగా మరో 35 వేల సర్వీసులు వచ్చి చేరుతున్నాయి. కనెక్షన్లతో పాటు వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతంలో వేసవిలో మాత్రమే ఏసీలు వాడేవారు. ప్రస్తుతం సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి ఇంట్లో ఏసీ పని చేస్తూనే ఉంది. ఏడాదికి కనెక్షన్ల పెరుగుదల 10 నుంచి 12 శాతం ఉండగా, విద్యుత్ వినియోగం 30 నుంచి 40శాతం నమోదవుతోంది. బిల్లే కదా కట్టుకుందాం అనే ధోరణి ఇటీవల విపరీతంగా పెరిగింది. గృహజ్యోతి పథకం లబ్ధిదారుల్లోనూ ఈ మార్పు స్పష్టంగా కన్పిస్తోంది. గతంలో 100 యూనిట్లలోపు వాడేవారు.. ప్రస్తుతం 200 యూనిట్లకుపైగా వినియోగిస్తున్నారు. ఏకధాటి వర్షాలు, వరదల సీజన్‌లోనూ ఇదే స్థాయిలో డిమాండ్ నమోదవుతుండటం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోం

ఒకవైపు సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరుస్తూనే.. మరోవైపు క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరులోనూ మార్పునకు కృషి చేస్తున్నాం. సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో కలిసి ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ ఇంజనీర్లతో సమావేశమవుతున్నాం. రాత్రి పగలు తేడా లేకుండా జోరు వానలోనూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నాం. వినియోగదారులను స్వయంగా కలిసి విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నాం. సరఫరాలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేస్తున్నాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఇంజనీర్లు, జూనియర్ లైన్‌మెన్లపై చర్యలకు ఆదేశిస్తున్నాం. కొత్త కనెక్షన్లజారీలోనూ పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాం. సెక్షన్ల వారీగా పెండింగ్ దరఖాస్తులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం. అవినీతి నిర్మూలన కోసం ఇప్పటికే సర్కిళ్లు, సెక్షన్లతో పాటు బహుళ అంతస్తుల భవనాల్లో కాల్ సెంటర్ నంబర్లతో కూడిన స్టిక్కర్లు అతికించాం. ఇంజనీర్ల పనితీరుపై నిరంతర నిఘా ఏర్పాటు చేశాం అని స్పష్టం చేశారు.

'ఇంట'ర్నెట్ కట్‌కట

అడ్డగోలుగా కత్తిరింపులు.. రోడ్లపైనే కేబుళ్ల గుట్టలు

- మూడు వారాలైనా పునరుద్ధరణకు నోచుకోని సేవలు
- వివిధ ఆఫర్లలో ముందే చార్జీలు చెల్లించిన వినియోగదారులు
- ఆన్‌లైన్ సేవల అంతరాయాలపై విరుచుకుపడుతున్న సిటిజన్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఆవుల కుమ్ములాటలో దూడలు బలైనట్లు' దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ–ఇంటర్నెట్ ఆప్టికల్ సర్వీసు ప్రొవైడర్లు(ఐఎస్‌పీ), ఎంఎస్‌ఓలు, లోకల్ కేబుల్ ఆపరేటర్లు (ఎల్‌సీఓలు) మధ్య నెలకొన్న పోరులో అమాయక వినియోగదారులు బలవుతున్నారు. మూడు వారాలు దాటినా ఇంటర్నెట్ సేవలు, టీవీ ప్రసారాలను పునరుద్ధరించకపోవడంతో.. ఇంటి నుంచి విధులు నిర్వహించే ఐటీ, అనుబంధ రంగాల ఉద్యోగులు సహా పిల్లలకు ఆన్‌లైన్ తరగతులు బోధించే తల్లిదండ్రులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. వివిధ ఆఫర్లలో భాగంగా ముందే ఏడాది/ఆరు నెలల చార్జీలు చెల్లించిన వినియోగదారులు సైతం ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది.

❖ ఆగస్టు 17న రామంతాపూర్ గోఖలేనగర్ ఘటనతో విద్యుత్‌శాఖ అప్రమత్తమైంది. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు, కార్మికులు, సాధారణ పౌరుల మృత్యువాతకు కారణమవుతున్న ఈ ప్రమాదకరమైన ఆప్టికల్ కేబుల్ వైర్ల తొలగించాలని నిర్ణయించింది. ఆ మేరకు కొద్ది రోజులుగా గ్రేటర్ జిల్లాల్లో ఎక్కడికక్కడే కేబుళ్లను కట్ చేస్తోంది. స్తంభాలపై లైన్లు వేస్తున్నప్పుడు మిన్నకుండిపోయి.. తీరా వేసిన తర్వాత కట్ చేయడం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. ఐఎస్‌పీలు, ఎంఎస్‌ఓలు, ఎల్‌సీఓలు తప్పు చేస్తే.. వినియోగదారులకు శిక్ష వేయడం ఎంత వరకు సబబు అనే ప్రశ్న తలెత్తుతోంది.

రూ.100 కోట్లకుపైగా నష్టం

❖ గ్రేటర్ పరిధిలో ఐదు లక్షలకుపైగా విద్యుత్ స్తంభాలు ఉన్నట్లు అంచనా. ఏదైనా విద్యుత్ స్తంభంపై కేబుల్ వేయాలంటే ముందస్తుగా ఆ శాఖ అనుమతి తీసుకోవాలి. ఇందుకు ఒక్కో స్తంభానికి ఏటా రూ.50 నుంచి రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంది. 15 మీటర్ల ఎత్తులోనే కేబుల్ అమర్చుకోవాలి. మెజారిటీ కేబుళ్లు ఆరేడు అడుగుల ఎత్తులోనే వేలాడుతున్నాయి. ఒక స్తంభానికి, మరో స్తంభానికి మధ్య 50 మీటర్లకు మించరాదు.. కానీ మెజార్టీ స్తంభాలకు టన్నుల కొద్దీ బరువైన కేబుల్ ఉండలు వేలాడుతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి మధ్యలో ఏదైనా చెట్టు కొమ్మ విరిగి లైన్‌పై పడితే.. ఆ బరువుకు రెండు వైపులా ఉన్న స్తంభాలు నేలకూలుతున్నాయి.

❖ దెబ్బతిన్న ఇన్సులేటర్లు, జాయింట్లను పునరుద్ధరించేందుకు లైన్‌మెన్లు స్తంభాలపైకి ఎక్కడం చాలా కష్టంగా మారింది. కేబుళ్ల నుంచి ఎర్తింగ్ రివర్స్ వల్ల షాక్‌తో కిందపడి పోతున్న ఘటనలు లేకపోలేదు. కనీస అనుమతులే కాదు కనెక్షన్, మీటర్ తీసుకోకుండా ఏకంగా కేబుల్ జంక్షన్ బాక్సులకు కరెంట్‌ను వినియోగిస్తున్నారు. ఏళ్ల తరబడి కళ్లముందే ఈ చౌర్యం జరుగుతున్నా.. క్షేత్రస్థాయి ఇంజినీర్లు పట్టించుకోలేదు. కొత్తగా అనేక ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు (ఐఎస్‌పీ), ఎంఎస్‌ఓలు, లోకల్ కేబుల్ ఆపరేటర్లు (ఎల్‌సీఓలు) పుట్టుకురావడం, వ్యాపారంలో పోటీతో ఎవరికి వారు స్తంభాలపై కేబుళ్లను వేసుకుంటూ ముందుకెళ్లడం, ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు పాత వైర్లను అలాగే వదిలేసి, కొత్తగా మరో ఆప్టికల్ కేబుల్‌ను అమర్చుతుండటం, తాజాగా వాటన్నింటినీ తొలగిస్తుండటంతో ఇప్పటికే రూ.100 కోట్లకుపైగా నష్టపోవాల్సి వచ్చిందని ఆయా సర్వీసు ప్రొవైడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్లకూ తప్పని సిగ్నల్ సమస్య

కేవలం ఆపరేటర్లే కాదు సేవల వినియోగంలో భాగంగా ముందే ఆఫర్ల పేరుతో (సంవత్సరం /ఆరు నెలలు) చార్జీలు చెల్లించిన గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల వినియోగదారులు సైతం ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మూడు వారాలైనా ఆయా సర్వీసులు పునరుద్ధరించపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక..ఆయా సర్వీసు ప్రొవైడర్లు కాల్ సెంటర్లు/ వ్యక్తిగత ఫోన్లు స్విచ్ ఆఫ్ చేస్తున్నారు. మెజార్టీ ప్రజలు గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో వైఫై సర్వీసులను వాడుతున్నారు. ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాల్లోనూ ఈ తరహా సేవలనే వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఆప్టికల్ కేబుళ్లన్నింటినీ కట్ చేయడంతో సర్వీసులు నిలిచిపోయి సిగ్నల్ సమస్యలు తలెత్తుతున్నాయి. రోజంతా టీవీ సీరియల్స్, ఓటీటీ సినిమాలు, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్ సర్వీసులకు అలవాటు పడిన గృహిణులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే పనిలో పడ్డారు. కట్ చేసిన కేబుళ్లను అక్కడే రోడ్లపైనే గుట్టలుగా వదిలేసి వెళ్తుండటం, అటుగా వచ్చిపోయే వాహనదారులు వైర్ల మధ్య చిక్కుకుని ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో కేబుళ్లు టైర్ల మధ్య చిక్కుకుపోయి ప్రమాదాలకు కారణమవుతోంది.

కార్యాలయానికి స్థలం కేటాయించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ పారామిలిటరీ సిబ్బంది

ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరిన మాజీ పారా మిలిటరీ సిబ్బంది సంఘం

మీర్‌పేట: తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ ఫోర్సెస్ సిబ్బంది సంక్షేమ సంఘం కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఆదివారం సంఘం సభ్యులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కె.శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దాదాపు 1,500 పారామిలిటరీ కుటుంబాలు నివసిస్తున్నాయని, గతంలో పలు మార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో పాటు పక్కనున్న బడంగ్‌పేట కార్పొరేషన్‌లో మాజీ పారామిలిటరీ సిబ్బంది కుటుంబాలకు ఆస్తిపన్ను రద్దు వర్తింపజేస్తున్నప్పటికీ మీర్‌పేట ప్రాంతంలో మాత్రం వసూలు చేస్తున్నారని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లు దేశ సేవ చేసిన పారా మిలిటరీ బలగాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని, త్వరలోనే కుర్మల్‌గూడ ప్రాంతంలో స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో పాటు మీర్‌పేట కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇంటి పన్నును రద్దును వర్తింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో యాదగిరిరెడ్డి, యాదయ్య, రాజారత్నం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవి కుమార్ కథనం ప్రకారం.. ఆదిబట్లలోని టీసీఎస్ పక్కన ఉన్న మిలన్ డ్రైవ్ హోటల్ ముందు ఆదివారం ఓ గుర్తు తెలియని మృతదేహం పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వచ్చి పరిశీలించే సరికి మృతి చెందిన వ్యక్తి భిక్షాటన చేసే వ్యక్తిగా గుర్తించారు. వయసు దాదాపు 55 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పొగ వెలువడి.. శ్వాస కొరవడి

- జల్‌పల్లిలో ప్రజారోగ్యానికి కుంపటిలా సీసం బట్టీలు
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- విమానాలకు పొంచి ఉన్న సిగ్నల్ సమస్య


జల్‌పల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఓ సీసం బట్టీ

పహాడీషరీఫ్: అక్రమంగా కొనసాగుతున్న సీసం బట్టీలతో జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉంది. జల్‌పల్లి పార్థివాడ, శ్రీరాం కాలనీలలో ఎలాంటి అనుమతులు లేకుండా సీసం బట్టీలు (పాత బ్యాటరీల నుంచి సీసం కరిగించడం) యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నగరంలోని బ్యాటరీ, స్క్రాప్ దుకాణాల నుంచి పాడైన బ్యాటరీలు తీసుకొచ్చి ఇక్కడ వాటిని ధ్వంసం చేసి అందులోని సీసంను కరగపోస్తూ పెద్ద ఎత్తున కాలుష్యానికి పాల్పడుతున్నారు. ఈ సమయంలో వెలువడుతున్న దట్టమైన పొగలు స్థానిక ప్రజలను శ్వాస తీసుకోకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సమస్య తీవ్రతను గుర్తించిన ప్రజలు మున్సిపాలిటీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం లేదు. జల్‌పల్లి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఒకట్రెండు పర్యాయాలు అధికారులు దాడులు చేసి సీసం బట్టీలు ధ్వంసం చేశారు. కొన్నాళ్ల పాటు స్తబ్దుగా ఉన్న నిర్వాహకులు మళ్లీ తమ అక్రమాలను మొదలెట్టారు. తాజాగా మున్సిపల్ కార్యాలయం వెనుకాల కూతవేటు దూరంలో మరో బట్టీ ప్రారంభమయింది.

భూమిలో కలుస్తున్న వ్యర్థాలు

జల్‌పల్లి, శ్రీరాం కాలనీలలో కొనసాగుతున్న సీసం బట్టీలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. కాలం చెల్లిన బ్యాటరీలను ధ్వంసం చేసి.. అందులో నుంచి సీసాన్ని వేడి చేసి బట్టీల ద్వారా కరగదీసి ద్రవంగా మార్చే క్రమంలో పెద్ద ఎత్తున రసాయన వ్యర్థాలను భూమిలోకి వదులుతున్నారు. ఈ కారణంగా శ్రీరాం కాలనీలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. ప్రస్తుతం ఇక్కడి బోర్లలో మొదటి 10–15 నిమిషాల పాటు నీరు రంగు మారి వస్తుండడం ఇక్కడి ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. దీంతో పాటు సీసంను కరిగించే సమయంలో క్యాడ్మియం, లెడ్ కరిగి దాని వ్యర్థాలు కూడా దుమ్ము రూపంలో పొగలో కలిసి కాలనీలో పడిపోతుంది.

శ్వాసకోశ వ్యాధులు

పగలు, రాత్రి తేడా లేకుండా కొనసాగుతున్న ఈ సీసం బట్టీలు స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దట్టమైన పొగల కారణంగా శ్వాస పీల్చుకోలేక సతమతమవుతున్నారు. ఈ సమస్య కారణంగా చిన్నారులు, వృద్ధులు, టీబీ, క్యాన్సర్, చర్మ వ్యాధులకు గురవుతున్నారు. ఇక శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో ఈ సీసం బట్టీలు కొనసాగుతున్నా అటు మున్సిపాలిటీ గాని.. ఇటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కాని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. విమానాశ్రయాలకు కొన్ని కిలోమీటర్ల దూరంలోనే అధికారులు పొగను పైకి విడుస్తూ సిగ్నల్‌ను ఇస్తారు. దాని ఆధారంగా విమానాల ల్యాండింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. కాని ఇక్కడ విమానాశ్రయానికి ఒకట్రెండు కిలోమీటర్ల దూరంలో ఇలాంటి అక్రమ కంపెనీల ద్వారా వెలువడుతున్న పొగతో పెను ప్రమాదమే పొంచి ఉంది.

వృద్ధులకు అవస్థ



సీసం బట్టీల సమస్య తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా వయో వృద్ధులకు శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. చీకటి పడినప్పటి నుంచి తెల్లవార్లు వెలువడుతున్న దట్టమైన పొగలను భరించలేకపోతున్నాం. ఈ విషయమై పలుమార్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదులు సైతం చేశాం. – వినోద్, జల్‌పల్లివాసి

చర్యలు తీసుకుంటాం



అక్రమంగా కొనసాగే వ్యాపారాలపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల ఆరోగ్యానికి చేటు చేసే పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించాం. ట్రేడ్ లైసెన్స్‌కు అనుగుణంగా వ్యాపారాలు చేసుకునేలా ఎప్పటికప్పుడు సూచిస్తున్నాం. స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. – వెంకట్రామ్, కమిషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ

నేరాల నియంత్రణలో 'సీసీ'లు కీలకం


సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో సీఐ శంకర్ నాయక్, మాజీ కార్పొరేటర్ హరినాథ్‌రెడ్డి

మీర్‌పేట: ప్రతిఒక్కరూ తమ వీధిలో, ఇంటి ఎదుట సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ సూచించారు. మీర్‌పేట డీఎల్‌ఆర్‌ఎల్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరస్తులను పట్టించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కీసర హరినాథ్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సభ్యులు లక్ష్మణాచారి, నరసింహులు, భిక్షపతిరెడ్డి, అంజయ్య, మాణిక్ ప్రభు, శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మను ఎందుకు కొడుతున్నావని ప్రశ్న..

కుమారుడిపై తండ్రి హత్యాయత్నం

ఫిలింనగర్: అమ్మను ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించిన కుమారుడిపై తండ్రి కత్తితో గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో నివసించే అల్లం నర్సింహ్మ రోజూ పీకలదాకా మద్యం తాగి ఇంటికి వస్తూ భార్యపై అనుమానం పెంచుకుంటూ ఆమెను తీవ్రంగా కొడుతుండేవాడు. ప్రతిరోజూ భార్యను అనుమానించడమే కాకుండా తాగిన మైకంలో ఆమెను కొడుతుండడంతో ఇదేమి పద్ధతి అని కుమారుడు సురేష్ పలుమార్లు తండ్రిని నిలదీయగా అతన్ని కూడా కొట్టేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో భార్యపై దాడి చేసి తీవ్రంగా కొట్టగా సురేశ్ అడ్డుకున్నాడు. ఈ క్రమంలో నర్సింహ్మ జేబులో ఉన్న కత్తి తీసి కొడుకు మెడను కోశాడు. తీవ్ర రక్తస్రావం మధ్య సురేష్‌ను అపోలో హాస్పటల్‌లో చికిత్స నిమిత్తం చేర్చారు. మెడకు తీవ్రంగా గాయాలయ్యాయని వైద్యులు వెల్లడించారు. తనతో పాటు తల్లిపై హత్యాయత్నానికి పాల్పడిన తండ్రిపై చర్యలు తీసుకోవాలంటూ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుప చువ్వలు పడి కార్మికుడి మృతి

కొత్తూరు: పరిశ్రమలో పనిచేస్తున్న ఓ కార్మికుడు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మండలంలోని తీగాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన దీపక్(33) రాయలసీమ ఇండస్ట్రీస్ పరిశ్రమలో గత కొన్ని నెలలుగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల శనివారం రాత్రి విధుల్లో భాగంగా పరిశ్రమలో ఇనుప చువ్వలను తరలించే క్రేన్ పక్కన పనిచేస్తున్నాడు. క్రేన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా సూచనలు పాటించకుండా కిందికి దించడంతో ఇనుప చువ్వలు దీపక్‌పై పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన తోటి కార్మికులు అయన్ని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి బంధువు దరోగ మాంజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య


సుకమోల్ జైన్ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్థిక సమస్యల కారణంగా చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ జిల్లాకు చెందిన చెందిన సుబ్రత్ జైన్‌కు భార్య, ఇద్దరు కుమారులతో కలిసి మండలంలోని కవాడిపల్లిలో నివాసముంటున్నాడు. అతని పెద్దకుమారుడు సుకమోల్ జైన్(20) గ్రామ శివారులోని జీఎస్‌పీ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్నాడు. అతడు ఆదివారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. కాసేపటికే సుకమోల్‌తో పని చేసే యువకుడు సుబ్రత్ జైన్‌కు ఫోన్‌చేసి మీ కుమారుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించాడు. తన కుమారుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

సినీ నటుడిని బెదిరిస్తున్న యువతిపై కేసు

బంజారాహిల్స్: ఏఐ టెక్నాలజీతో ఓ బాలీవుడ్ నటుడి ఫోటోలను నగ్నంగా మార్ఫింగ్ చేస్తూ ఆయన స్నేహితులకు, దర్శక, నిర్మాతలకు, కుటుంబ సభ్యులకు పోస్ట్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న యువతిపై బంజారాహిల్స్‌లో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబై నివాసి, ఫ్రీలాన్స్ నటుడు ఆనంద సురేష్ కుమార్ రెన్వా (36)ను జియా ఉనిస్సా నస్రీన్ అనే మహిళ మూడు సంవత్సరాలుగా నిరంతరం వేధిస్తోంది. అతని ఇన్‌స్టాగామ్, వాట్సప్, ఫోన్ అకౌంట్స్ హ్యాక్ చేసి, అతని పేరుతో ఏఐ ద్వారా మార్ఫింగ్ చేసిన సెమీ న్యూడ్, న్యూడ్ ఫోటోలు, వీడియోలు సృష్టించింది. ఆ మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలను పరిశ్రమలోని దర్శకులకు, రెండు ప్రొడక్షన్ హౌస్‌లకు పంపించి అరాచకానికి పాల్పడిందని, ఈ కారణంగా తన వృత్తిపై తీవ్ర ప్రభావం చూపిందంటూ బాధిత నటుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాదాపు 15 నుంచి 20 నకిలీ ఖాతాల ద్వారా అతన్ని అవమానపరిచేలా పలు సందేశాలను, వీడియోలను పంపింది. అతని కుటుంబాన్ని లక్ష్యంగా చేయడంతో తీవ్ర మానసిక ఒత్తిడి ఏర్పడిందని, హృద్రోగ లక్షణాలు కూడా వచ్చాయని బాధితుడు పేర్కొన్నాడు. అంతేకాకుండా అతని సోదరికి కూడా అశ్లీల సందేశాలు పంపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జింఖానా క్లబ్ చైర్మన్‌గా శివరామకృష్ణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ది హైదరాబాద్ జింఖానా క్లబ్ చైర్మన్‌గా గూడురు శివరామకృష్ణ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన క్లబ్ ఎన్నికల్లో నాగ కిషోర్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. చైర్మన్‌గా గూడురు శివరామకృష్ణ, వైస్ చైర్మన్‌గా ఎస్.మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీగా ఎన్.నాగ కిషోర్, జాయింట్ సెక్రటరీగా వెన్నం అనిల్‌రెడ్డి, ట్రెజరర్‌గా గడ్డిపాటి హరీష్, డైరెక్టర్లుగా కనుమూరి నారాయణరాజు, రఘురామ్, కంజర్ల సదాశివయాదవ్, కంటిపూడి శ్రీనివాస్‌చౌదరి, అత్తలూరి సుధీర్‌కుమార్, రవికుమార్ వడ్లమూడి విజయం సాధించారు. మొత్తం 2064 ఓట్లకు గాను 1420 ఓట్లు పోలయ్యాయి.

కుంట.. వెంచరేనంట!

రియల్ వ్యాపారుల అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఏకంగా ఓ కుంటనే వెంచర్ వేసి ప్లాట్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. రూపాయిరూపాయి కూడబెట్టుకొని కొనుగోలు చేసిన వారికి తర్వాత పాట్లు తప్పడం లేదు. నందిగామ మండలం చేగూరు శివారులోని కుంటలో వేసిన వెంచర్ ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా మునిగిపోయింది. దీంతో తమ ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియక కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. – నందిగామ



150 కిలోల నల్లబెల్లం పట్టివేత


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితురాలు, పట్టుబడిన నల్లబెల్లం, పటిక సంచులు

ఆమనగల్లు బస్టాండ్‌లో ఎక్సైజ్ పోలీసుల సోదాలు

ఆమనగల్లు: నాటుసారా తయారీ కోసం అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికలను స్వాధీనం చేసుకుని ఒక మహిళను ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లబెల్లం, పటికలను ఆర్టీసీ బస్సులో హైదరాబాద్ నుంచి తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఎస్‌టీఎఫ్ బృందం, ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఆమనగల్లు బస్టాండ్‌లో తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన మహిళ వద్ద ఉన్న బస్తాలను తనిఖీ చేయగా 150 కిలోల నల్లబెల్లం, 15 కిలోల పటిక లభ్యమైంది. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు చెందిన ఎల్లమ్మ అనే మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌టీఎఫ్ ఎస్ఐ బాలరాజు, సిబ్బంది సురేశ్, శ్రీను, శ్రీజ తదితరులు ఉన్నారు.

తరలిస్తే కఠిన చర్యలు

నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, ముడి పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బద్యానాద్‌చౌహాన్ హెచ్చరించారు. దసరా పండుగ నేపథ్యంలో సారా తయారీ కోసం హైదరాబాద్ నుంచి నల్లబెల్లం, విప్పపువ్వు, ఇతర విడి పదార్థాలు తరలిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఫిలింనగర్‌లో బంగారు నగల చోరీ

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని సినార్ వ్యాలీ ఫేజ్–1లో భారీ చోరీ జరిగింది. అల్మారాలో ఉంచిన బంగారు నగలు కనిపించకపోవడంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సినార్ వ్యాలీలో నివసించే రాధికా శర్మ అనే యజమానురాలు తన పుట్టింటి వాళ్లు ఇచ్చిన నగలను సెంటిమెంట్‌గా అల్మారాలో దాచుకుంది. ఇటీవల తమ మామకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఎక్కువగా ఆస్పత్రుల చుట్టూ తిరిగింది. రెండు రోజుల క్రితం అల్మారాలో ఉంచిన నగల కోసం చూడగా అవి కనిపించలేదు. తన గది క్లీన్ చేయడానికి జ్యోతి అనే పని మనిషి మాత్రమే వస్తుందని, ఈ నగల చోరీ వెనుక ఆమె ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేస్తూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా పంపిణీ చేయండి

సరిపడా దొరకక బాయిమీది తండా రైతుల ఆందోళన

తాండూరు రూరల్: చేతికి వచ్చిన పంటలు పాడవుతున్నాయని, ఇప్పటికైనా యూరియా అందుబాటులో ఉంచాలని పెద్దేముల్ మండలం బాయిమీది తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు స్థానికంగా మాట్లాడుతూ.. గత మూడు రోజుల నుంచి తట్టెపల్లి పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా కోసం వెళ్తున్నామన్నారు. అక్కడ మాత్రం స్థానికులకే యూరియా పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే చెరుకు, పత్తి, వరి పంటలను సాగు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తట్టెపల్లి సొసైటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సీఈఓ చంద్రమౌళిలు స్పందించి తమకు యూరియా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు మన్యానాయక్, చందర్‌నాయక్, జ్ఞానేశ్వర్, శంకర్‌నాయక్, శంకర్‌చౌహాన్, సందీప్‌కుమార్, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు కొనేందుకు వెళ్తూ..

లారీ ఢీకొట్టడంతో ఒకరి దుర్మరణం


ఘటనాస్థలిలో మల్లేశ్ మృతదేహం

చేవెళ్ల: కూరగాయలు కొనేందుకని బైక్‌పై వెళ్లిన ఓ వ్యక్తిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన వడ్డె మల్లేశ్(32) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన ఇంటి నుంచి కూరగాయలు కొనేందుకు తన బైక్‌పై చేవెళ్లకు వస్తున్నారు. మార్గమధ్యలో కందవాడ లింక్ రోడ్డు సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ లారీ చక్రాల కింది పడి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, ముగ్గురు పిల్లలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తెగని పంచాయితీ

- స్థానిక ఎన్నికలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఆందోళన
- జోరుగా అనుచరులతో మంతనాలు



సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో.. పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా.. కొత్త విధానం అవలంబిస్తారా.. ఇలా పల్లెల్లో ఎక్కడ చూసినా చర్చ సాగుతోంది. పంచాయతీ పదవులపై కన్నేసిన ఆశావహులు ఓ వైపు రిజర్వేషన్ కలిసొస్తుందో లేదోనని ఆందోళన పడుతూనే, వర్తించకపోతే ఏం చేయాలోనని ప్రస్తుతం తర్జనభర్జన పడుతున్నారు. కొందరు ఆసక్తిగల నేతలు తమ అనుచరగణంతో ఎన్నికలపై సమాలోచనలు జరుపుతున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు సైతం తమ హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రావాల్సి ఉన్నా.. వచ్చే ఎన్నికల్లో తమ ఉనికి చాటుకునేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు.

కొత్త విధానమా?

గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమల్లో ఉండేలా గత ఎన్నికల సమయంలోనే చట్టం రూపొందించింది. ఆ చట్టం ప్రకారం పాత రిజర్వేషన్లనే కొనసాగించాల్సి ఉంటుంది. కానీ, ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని సర్కార్ కొత్త విధానం అమలు చేసి తన మార్కు చూపెట్టుకుంటుందనే అభిప్రాయాలున్నాయి. అదే జరిగితే పాత రిజర్వేషన్ల చట్టాన్ని రద్దు చేసి కొత్తది రూపొందించాల్సి ఉంటుందని, అందుకు ఏ పద్ధతులను అమలు చేస్తారోననే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. రిజర్వేషన్ల అమలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

ఓటరు జాబితా తయారీ

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండేలా ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికార యంత్రాంగం ఓటరు తుది జాబితా తయారీ పూర్తి చేసింది. ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చేశారు. ఫొటో ఓటరు జాబితా ప్రచురించింది. ఓటరు జాబితాపై అభిప్రాయ సేకరణ కోసం జిల్లాస్థాయి రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. పంచాయతీల వారీగా ఓటరు తుది జాబితాను ప్రచురించారు.